పేదలపై భారం..


రేషన్ దుకాణంలో వేలిముద్రలు తీసుకుంటున్న డీలర్

- రేషన్ దుకాణాల్లో బియ్యం మాత్రమే పంపిణీ
- భారీగా పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు
- సబ్సిడీపై ఇవ్వాలంటున్న ప్రజలు

బోథ్: రోజు వారి జీవితంలో బియ్యంతో పాటు పప్పు, గోధుమ, పసుపు, కారంపొడి, చింతపండు, నూనె వంటివి కూడా నిత్యావసర వస్తువులే. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి అమ్మహస్తం పథకంలో భాగంగా బియ్యం, గోధుమలు, కిరోసిన్, నూనె, చింతపండు, పప్పులు, గోధుమ పిండి, పంచదార, ఉప్పు, పసుపు, కారం పోడి తొమ్మిది సరుకులను రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు పంపిణీ చేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం పాత విధానాలకు స్వస్తి పలికింది. కేవలం బియ్యాన్ని మాత్రమే సబ్సిడిపై సరఫరా చేస్తోంది. మిగిలిన నిత్యావసర సరుకులను బహిరంగ మార్కెట్‌లో కొనలేక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

నియోజకవర్గంలోని బోథ్ మండలంలో 24 రేషన్ దుకాణాలు ఉండగా.. 13,287 రేషన్ కార్డులు ఉన్నాయి. బజార్‌హత్నూర్‌లో 21 రేషన్ దుకాణాలు, 7856 రేషన్ కార్డులు, భీంపూర్ మండలంలో 15 రేషన్ దుకాణాలు, 6919 రేషన్ కార్డులు, గుడిహత్నూర్‌లో 12 రేషన్ దుకాణాలు, 8433 రేషన్ కార్డులు, ఇచ్చోడలో 20 రేషన్ దుకాణాలు, 11591 రేషన్ కార్డులు, నేరడిగొండలో 16 రేషన్ దుకాణాలు, 7885 రేషన్ కార్డులు, సిరికొండలో 08 రేషన్ దుకాణాలు, 4359 రేషన్ కార్డులు, తలమడుగులో 16 రేషన్ దుకాణాలు, 9451 రేషన్‌కార్డులు, తాంసిలో 10 రేషన్ దుకాణాలు, 4854 రేషన్ కార్డులున్నాయి. నియోజకవర్గంలో మెత్తం 142 రేషన్ దుకాణాలుండగా.. 74635 రేషన్ కార్డులున్నాయి. గతంలో రేషన్ కార్డులు కుటుంబంలో ఐదుగురు వ్యక్తులుంటే నాలుగు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. ఆహార భద్రత అమల్లోకి వచ్చినప్పటి నుంచి కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమంది సభ్యులకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. బియ్యం కోటా పెంచడం వలన సామాన్యులకు కొంత ఆర్థిక భారం తగ్గింది. కానీ బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకులు ఆకాశాన్నంటుతున్నాయి.

అన్ని సరుకులు అందించాలి



రేషన్ దుకాణాల్లో బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు. మిగిలిన నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో పేద ప్రజలు వాటిని కొనలేక పోతున్నారు. రేషన్ దుకాణాల ద్వారా అన్ని రకాల సరుకులు అందించాలి. పేదలకు అందుబాటులో ఉండేలా ధరలను నియంత్రించాలి.
– కట్ట భూమేష్, బోథ్

కొనలేని పరిస్థితి



రేషన్ దుకాణాలలో అన్ని రకాల సరుకులు అందించాలి. బియ్యం కోటా పెంచి ఉన్న సరుకులను తీసివేయడం సరికాదు. పేదలపై భారం కాకుండా చూడాలి. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకులను కొనలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వ స్పందించి నిత్యావసర సరుకులు అందించాలి.
– మీర్ ఇర్షాద్ అలీ, బోథ్

అమ్మహస్తం కొనసాగించాలి



గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమ్మహస్తం పథకంలో భాగంగా తొమ్మిది రకాల సరుకులు పంపిణీ చేసింది. టీఆర్ఎస్ ప్రభుత్వం అమ్మహస్తం పథకాన్ని నిర్వీర్యం చేసింది. వెంటనే అమ్మహస్తం పథకాన్ని పునరుద్ధరించాలి.
– ఆడె గజేందర్, కాంగ్రెస్ నాయకులు

క్లుప్తంగా

అభివృద్ధిపై దృష్టి సారించండి


కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్

నార్నూర్: నార్నూర్, గాదిగూడ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కులు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కోరారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. గ్రామాలకు రోడ్లు, నీటి వసతి కల్పించాలన్నారు. వారి వెంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు, వైస్ ఎంపీపీ యోగేష్, ఆమెస్రం శేఖర్, ఈశ్రు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

తాంసి: ఉపాధిహామీ కూలీల సంఖ్యను మరింత పెంచాలని డీఆర్‌డీవో ఏపీడీ రాథోడ్ రవీందర్ అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని పొన్నారి, హస్నాపూర్, వడ్డాడి గ్రామాల్లో ఉపాధిహామీ పనులను ఇన్‌చార్జి ఎంపీడీవో రవీందర్‌తో కలిసి పరిశీలించారు. కూలీలతో మాట్లాడి పని ప్రదేశంలో కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలోని నర్సరీలను పరిశీలించారు. సర్పంచ్‌లు సంజీవ్ రెడ్డి, నర్సింగ్, శ్రీనివాస్, ఏపీవో విజయ, పంచాయతీ కార్యదర్శి విజయ్, లత, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

గుడిహత్నూర్: ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న సీనియర్ జర్నలిస్టు నాగుల సతీష్‌ను బీజేపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సుహాసినీ రెడ్డి బుధవారం మండల కేంద్రంలో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆమె వెంట నాయకులు రమ, సంజీవ్ కుమార్, గటిక క్రాంతికుమార్, జాడి సుభాష్ ఉన్నారు.

బస్ బుకింగ్‌పై రాయితీ

ఆదిలాబాద్: పెళ్లిళ్లు, విహార యాత్రలకు ఆర్టీసీ బస్ బుకింగ్‌పై పది శాతం రాయితీ కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ వివిధ రకాల సేవలు అందిస్తుందన్నారు.

చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మామిడిగూడ ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న పుస్నక్ భాస్కర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ పర్దాన్ సమాజ్ సేవా సంఘ్ జిల్లా అధ్యక్షుడు దుర్వ నగేశ్ కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు ఫిర్యాదు చేశారు. సక్రమంగా విధులకు హాజరు కావడం లేదన్నారు.

'రాష్ట్రంలో కుటుంబ పాలన సాగుతోంది'


పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాస్ రెడ్డి

ఆదిలాబాద్: తెలంగాణ రాష్ట్రంలో కుటుంబ పాలన సాగుతోందని బీజేపీ నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో సీనియర్ రాజకీయ నాయకుడు, వ్యాపారవేత్త ఐనేటి సంతోష్‌రావు పార్టీలోకి చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఉష్కెం రఘుపతి, దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ రమణ, గొర్ల రాజుయాదవ్, శంకర్, కిష్టారెడ్డి, మెస్రం చిత్రు, సంతోష్ రెడ్డి, రాజేశ్, రవి కిరణ్‌రెడ్డి, సంజీవ్ పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి


నినాదాలు చేస్తున్న నాయకులు

నేరడిగొండ: కాన్షీరాం 89వ జయంతిని దళిత్ శక్తి ప్రోగ్రాం (డీఎస్పీ) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేరడిగొండ, బోథ్ మండలాల నాయకులు వెంకటేశ్, దేవేందర్‌లు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాధికారాన్ని అందించిన బహుజన రాజ్యాధికార సాధకుడు కాన్షీరాం అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, రమేశ్, నరేందర్, గణేష్, శ్రీకాంత్, సతీశ్, రాకేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: కాన్షీరాం కలలు కన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాన్ని సాధించాలని దళిత్ శక్తి ప్రోగ్రాం (డీఎస్పీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో కాన్షీరాం జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పవన్, కరాడి గంగన్న, నవీన్, రవి, మంజుష, శ్రీవాణి, సుష్మిత, సంతోశ్, రాజీవ్, రమేశ్ పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక కృషి

- ఎమ్మెల్యే జోగు రామన్న


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

జైనథ్: రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జాతీయ రహదారిపై తరోడ బ్రిడ్జి కుంగిపోవడంతో నిరాల– లాండ సాంగ్వి రోడ్డు విస్తరణకు రూ. 40 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. బుధవారం తరోడ బ్రిడ్జి వద్ద పరిస్థితులను పరిశీలించారు. స్థానికులు, ప్రయాణికులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వాగులోంచి తాత్కాలికంగా రోడ్డు నిర్మించామన్నారు. నిధులు మంజూరైతే నిరాల– లాండ సాంగ్వి సింగిల్ రోడ్‌ను డబుల్ రోడ్డుగా విస్తరిస్తామన్నారు. ఆయన వెంట నాయకులు తుమ్మల వెంకట్ రెడ్డి, సర్పన్ లింగారెడ్డి, మహేందర్‌రెడ్డి, నోముల సంతోష్ రెడ్డి, ప్రవీణ్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్‌నగర్ పార్టీ కార్యాలయంలో పలువురు యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 68 ఏళ్లలో జరగని అభివృద్ధి కేవలం బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలోనే జరిగిందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, గ్రంథాలయ చైర్మన్ మనోహర్, కౌన్సిలర్ పవన్‌నాయక్ పాల్గొన్నారు.

అధికారులు రాని సమావేశాలు ఎందుకు?

- అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ కల్యాణం లక్ష్మి

తలమడుగు: మండల సర్వసభ్య సమావేశాలకు అధికారులు హాజరుకానప్పుడు సమావేశాలు నిర్వహించడం ఎందుకని ప్రజాప్రతినిధులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీపీ కల్యాణం లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు నివేదిక పంపించాలని తీర్మానించారు. మండల వైద్యాధికారి హరీశ్ మాట్లాడుతూ.. మండలానికి కోటి 50 లక్షలతో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం నిర్మాణానికి భూమిపూజ చేశారు, కానీ పనులు ప్రారంభించలేదన్నారు. కజ్జర్ల సర్పంచ్ వెంకట్మ మాట్లాడుతూ.. దళితబంధు పథకంలో కజ్జర్లలో 10 మందికి 6 గురికే రుణాలు అందాయన్నారు. జెడ్పీటీసీ గణేశ్ రెడ్డి మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమన్వయంలో మండల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో రమాకాంత్, ఎంపీవో దీలిప్, ఎంఈవో నారాయణ పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు


హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

నేరడిగొండ: ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొత్తం 259 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 14 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శబాన తరన్నుం తెలిపారు.

తలమడుగు: మండలంలోని కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాతంగా జరిగాయి. మొదటి రోజు 13 విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. మొత్తం 142 మంది విద్యార్థులకు 129 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ వనజారెడ్డి, సత్యనారాయణ, దేవేందర్ తనిఖీ చేశారు.

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు సీఎస్ ఉదయ్‌కుమార్ తెలిపారు. మొత్తం 273 మంది విద్యార్థులకు 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

తాంసి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 361 మంది విద్యార్థులకు 345 మంది విద్యార్థులు హాజరయ్యారు. 16 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ తెలిపారు. ఎస్సై లాల్‌సింగ్ నాయక్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

యాత్రను విజయవంతం చేయండి

సిరికొండ: కాంగ్రెస్ నేత బట్టి విక్రమార్క నిర్వహించే హత్ సే హత్ జోడో యాత్రలో కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ కోరారు. మండల కేంద్రంలో బుధవారం కార్యకర్తలతో మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు ఆడే గజేందర్, షేక్ హిమామ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా రవీందర్

నేరడిగొండ: నేరడిగొండ మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా చవాన్ రవీందర్ నియమితులైనట్లు ఏఐసీసీ సభ్యుడు నరేష్ జాదవ్ అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సెడ్మకి ఆనంద్‌రావు, జాదవ్ వసంత్‌రావు, మల్యాల కరుణాకర్, శంకర్ గజ్జల, సంతోష్, తదితులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం


క్రికెట్ కిట్ అందజేస్తున్న సాకటి దశరథ్

నేరడిగొండ: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అన్నారు. బుధవారం మండలంలోని రోల్‌మామడలో శ్రీ సహాయ ఆదివాసీ యూత్ సభ్యులకు క్రికెట్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు సాబ్లే సంతోష్‌సింగ్, సోలంకి ప్రశాంత్, తొడసం శంకర్, ఉదయ్, రాథోడ్ రాజశేఖర్, భాక్రే శంకర్, బొంతుకుల శ్రీను, పవన్ నాయక్ పాల్గొన్నారు.

అకాల వర్షం

తాంసి: అకాల వర్షంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. తాంసి, భీంపూర్ మండలాలలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం కురుస్తున్న చిరుజల్లులకు పంటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం సాయంత్రం వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకోవడంతో తాంసి, హస్నాపూర్, పొన్నారి, వడ్డాడి, కప్పర్ల, జామిడి, పాలోడి, నిపాని, పిప్పల్‌కోటి, వడూర్, కరంజి(టి), అర్లి గ్రామాల్లో చిరుజల్లులు కురిశాయి.

ప్రాథమిక విద్యపై అవగాహన

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన కల్పించారు. మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో రిసోర్స్ పర్సన్ కిషన్‌రెడ్డి అంగన్‌వాడీ టీచర్లకు బోధన విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో మహిత ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్, కోఆర్డినేటర్ ప్రవీణ్, అంగన్‌వాడీ టీచర్లు వెంకటమ్మ, లత, మయూరి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బోథ్: దివ్యాగుల సమస్యలను పరిష్కరించాలని బోథ్ సర్పంచ్ సురేందర్ యాదవ్‌కు దివ్యాగుంల హక్కుల జాతీయ వేదిక సభ్యులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే, మంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని వారు కోరారు. అర్హులైన దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ అందించాలన్నారు. పెన్షన్‌ను రూ. 10 వేలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జక్కుల నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆరిఫా బేగం, మహిబూబ్ పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన


జడ్జిని సన్మానిస్తున్న దుకాణదారులు

బోథ్: వినియోగదారుల చట్టాలపై బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హుస్సేన్ వ్యాపారస్తులు, బోథ్ గ్రామస్తులకు మండల కేంద్రంలోని షాదీ ఖానాలో అవగాహన కల్పించారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల చట్టాల గురించి వివరించారు. ఈ సందర్భంగా జడ్జిని వ్యాపారుస్తులు, గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పంద్రం శంకర్, ఆడెపు హరీష్ కుమార్, విజయ్ కుమార్, విశ్వానంద్, భోజన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. ప్రమాదకరంగా ప్రయాణం



బజార్‌హత్నూర్: మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రతీరోజు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, కళాశాలలకు విద్యార్థులు ఆటోలు, మ్యాక్స్ వాహనాల్లో వెళ్తుంటారు. అయితే పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తుండడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఒక ఆటోలో 15 నుంచి 20 మంది విద్యార్థులను కూర్చోబెడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
– సంబంధిత అధికారి: సయ్యద్ ముజాహిద్, ఎస్సై, ఫోన్ 87126 59934

స్పందించారు.. దారి చూపారు

సాక్షి ఎఫెక్ట్..


ఫ్లెక్సీ తొలగించడంతో కనిపిస్తున్న బోర్డు

నేరడిగొండ: రాష్ట్రంలోనే ఎత్తైన జలపాతంగా పేరొందిన కుంటాల జలపాతానికి దారి చూపే బోర్డుపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారని 'సాక్షి' దినపత్రికలో మంగళవారం 'దారి తెలిసేదెలా?' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. బుధవారం అటవీశాఖ అధికారులు స్పందించి ఫ్లెక్సీని తొలగించారు. కుంటాల జలపాతంతో వైపు వెళ్లే గ్రామాల పేర్లు కనిపించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నేరడిగొండ: టీఎస్‌పీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు సాబ్లే సంతోష్ సింగ్, సోలంకి ప్రశాంత్‌లు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. టీఎస్ పీఎస్సీ కమిషన్ నుంచి పేపర్లు లీక్ కావడంతో కమీషన్ పనితీరుపై సందేహం కలుగుతోందన్నారు. టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్‌తో పాటు గత వారం నిర్వహించిన అసిస్టెంట్ ఇంజనీర్ పేపర్ కూడా లీక్ అయినట్టు అనుమానం కలుగుతోందన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మల ఉదయ్, పట్టణ అధ్యక్షుడు రాథోడ్ రాజశేఖర్, యువ నాయకుడు పవన్ కల్యాణ్, జాదవ్ భీంరావ్, భాక్రె శేఖర్, బొంతుకుల శ్రీను, ప్రేమ్ సింగ్, సత్యం పాల్గొన్నారు.

పేపర్ లీక్‌లో పెద్దల హస్తం

ఉట్నూర్: ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల కోసం నిర్వహించిన పరీక్ష పేపర్‌ల లీక్‌లో బీఆర్‌ఎస్ పెద్దల హస్తం ఉందని బీజేపీ నియోజకవర్గం నాయకుడు రితీశ్ రాథోడ్ ఆరోపించారు. బుధవారం ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు నిరుద్యోగుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారని మండిపడ్డారు. సమావేశంలో బీజేపీ నాయకులు శ్రీరాంనాయక్, రాజేశ్వర్, రమేశ్, వాసు, వెంకటేశ్, రాజాశేఖర్, కిరణ్, దేవిదాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వం ప్రమేయంతోనే లీకులు

ఇచ్చోడ: బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రమేయంతోనే టీఎస్ పీఎస్సీలో లీకులు జరుగుతున్నాయని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. సిట్టింగ్ జడ్జితో పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గ్రూప్ 1 పరీక్షలను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మెస్రం జంగుబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత్, సంయుక్త కార్యదర్శి పోశెట్టి, సృజన్, మనోజ్, హరినాథ్ పాల్గొన్నారు.

'కంటివెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

నేరడిగొండ: కంటివెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎండీ సద్దాం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటి పరీక్షలు చేసి, పలువురికి కళ్లద్దాలు అందజేశారు. ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండలంలోని పిప్రి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో బుధవారం కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ కవిత రఘునరెడ్డి ప్రారంభించారు. ప్రతిఒక్కరూ ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పండుగ మురళీమోహన్, మెడికల్ ఆఫీసర్ భీంరావ్, హెచ్‌ఈవో ప్రకాశ్, నర్సారెడ్డి, సతీష్, శంకర్, రమేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

సిరికొండ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పోచమ్మ, మైసమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలను గురువారం నుంచి నిర్వహించనున్నట్లు వేదపండితులు గొంగళ్ల ప్రవీణ్ స్వామి తెలిపారు. శనివారం పోచమ్మ, మైసమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

ఆదిలాబాద్‌టౌన్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఎంబ్రైడరీ శిక్షకురాలు పెందూర్ లక్ష్మి అన్నారు. సాయివైకుంఠ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంబ్రైడరీ, మగ్గం శిక్షణ బుధవారం ముగిసింది. ఉచిత శిక్షణ కల్పించిన రవికిరణ్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రావణి, పూజ, వీణ పాల్గొన్నారు.

రైతాంగ సమితికి రాజీనామా

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఉన్న కె.సాయన్న రాజీనామా చేస్తున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత కారణాలు, అనారోగ్య కారణంగా ఈనిర్ణయం తీసుకున్నానని అన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

తాంసి: భీంపూర్ మండలంలోని గొల్లఘాట్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కప్పర్ల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న విలాస్ గౌడ్ తనవంతు సాయంగా పాఠశాలలోని 25 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, ఎగ్జామ్ ప్యాడ్‌లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లక్ష్మీకాంత్, ఉపాధ్యాయులు అశోక్, పాఠశాల చైర్మన్ గంగాధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పక్షులకు నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలి

బోథ్: పక్షుల దాహార్తిని తీర్చేందుకు ఇంటి వద్ద నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని మండల కేంద్రానికి చెందిన పక్షి ప్రేమికుడు వెంకటేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రకృతి, పర్యావరణం, పక్షుల కోసం నీటి తొట్టెల ఏర్పాటు, బర్డ్ ఫీడర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలలో నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ, వార్డెన్ శాంతాబాయి, ఉమాదేవి, సరిత పాల్గొన్నారు.

స్థలం కేటాయింపు

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ పర్దాన్ సమాజ్ సంక్షేమం కోసం మావల మండలంలోని కేఆర్కే కాలనీలో మ్యాన్ రోడ్డుకు 2 గుంటల స్థలాన్ని కేటాయించినట్లు నాయకులు తెలిపారు. బుధవారం స్థలంలో జెండా ఎగురవేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కుర్సేంగే తానాజీ, పూసం ఆనంద్‌రావ్, ఆత్రం అనుసూయ, మధుసూదన్, మెస్రం శంకర్, గేడం నిరంజన్, కినాక సురేశ్, గేడం మాధవ్, కుడ్మేత ప్రకాష్ పాల్గొన్నారు.